క్లుప్తంగా

మాజీ మంత్రి రజిని క్రిస్మస్ శుభాకాంక్షలు



చిలకలూరిపేట: క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని నియోజకవర్గ ప్రజలకు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజిని శుభాకాంక్షలు తెలిపారు. సాటి మనుషుల పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ,ఆకాశమంతటి సహనం, అవధులు లేని త్యాగం, శాంతియుత సహజీవనం వంటివి తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు ఇచ్చిన మహోన్నత సందేశాలని తెలిపారు. క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆమె ఆకాంక్ష వ్యక్తం చేశారు.

పిల్లలూ... శభాష్..



నరసరావుపేట ఈస్ట్: గుంటూరురోడ్డులోని కే-రిడ్జి పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రిన్సిపల్ బర్నబాస్ మంగళవారం తెలిపారు. ఏరోస్కాటో బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలో తమ విద్యార్థులు మోక్షరామ్‌చరణ్, మోక్షిత్, కార్తికేయ, వహీద్‌లు ప్రతిభ చూపి జనవరి 11, 12తేదీలలో మహారాష్ట్ర షిరిడీలోని అహల్యాబినగర్‌లో జరగనున్న జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలో తమ విద్యార్థులు ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. విద్యార్థులను పాఠశాల ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, బహుభాషా పండితుడు పూలబాల, ప్రిన్సిపల్ బర్నబాస్, క్యాంపస్ ఇన్‌చార్జ్ కోట బాపూజీ, అకడమిక్ కోఆర్డినేటర్ పుట్టా హేమంత్, స్కేటింగ్ కోచ్ ఫిరోజ్, పీఈటీ కిషోర్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

క్రైస్తవ పాటల పోటీలకు ఆహ్వానం

చిలకలూరిపేట: క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని క్రైస్తవ పాటల పోటీలను ఈ నెల 29వ తేదీన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు అందెల శౌరి తెలిపారు. పట్టణంలోని అర్బన్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న అంబేడ్కర్‌భవన్‌లో ఆదివారం ఉదయం 11 గంటల నుంచి పోటీలు ఉంటాయన్నారు. స్త్రీ, పురుషులు ఎవరైనా పాల్గొనవచ్చన్నారు. మొదటి బహుమతిగా రూ. 3 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 2 వేలు, తృతీయ బహుమతిగా రూ. వెయ్యి, మూడు కన్సోలేషన్ బహుమతులుగా రూ. 500 తో పాటు మెమొంటోలు అందజేయబడతాయన్నారు. వివరాలకు 9951197170, 9154031013లను సంప్రదించాలన్నారు.



రొంపిచర్ల మార్కెట్ యార్డు ఆవరణలో టార్బలిన్ పట్టలు కప్పిన వరి ధాన్యం



కోత పరువం మించటంతో నేలవారుతున్న వరి పైరు



శావల్యాపురం మండలంలో తడిసిన ఓదెలు చూపుతున్న రైతు చెవల వెంకట కృష్ణయ్య

రైతు గుండెల్లో తుఫాన్

చిరుజల్లులతో మరింత ఆందోళన



శావల్యాపురం మండలంలో ధాన్యం రాసులపై పరదాలు కప్పుతున్న రైతులు

శావల్యాపురం: తుఫాన్ ప్రభావం ధాటికి వరి పంట సాగు చేసిన అన్నదాతలు పరిస్థితి దయనీయంగా మారింది. మంగళవారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా చిరుజల్లులు కురుస్తున్నాయి. దీంతో వరి పంట పొలాల్లోని కోత కోసిన ఓదెలు తడవటంతో గింజ మొలకెత్తి రంగు మారుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ఎకరానికి రూ.35 వేలు వ్యయం కాగా అకాల వర్షం వల్ల పంటలు దెబ్బతిని పెట్టుబడులు కూడా రావని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వ నిబంధనలు సడలింపులు చేసి తేమశాతం పరిగణలోనికి తీసుకోకుండా ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కొందరు రైతులు గత్యంతరం లేక దళారులను ఆశ్రయించటంతో వారు చెప్పిన ధరకు అమ్ముకుంటున్నారు.

రొంపిచర్ల మండలంలో...

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం నుంచి వర్షపు చిరుజల్లులు ప్రారంభమయ్యాయి. చిరుజల్లుల నుంచి కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు పరుగులు పెడుతున్నారు. చలి గాలితో ఎడతెరపిలేకుండా వర్షపు తుంపర్లు పడుతున్నాయి. ఇప్పటికే వరి పంటను హార్వెస్టింగ్ చేసిన ధాన్యం కల్లాల్లోనే ఉంది. వర్షం కారణంగా రైతులు వరి హార్వెస్టింగ్ పనులను నిలిపి వేశారు. ఇప్పటికే కోతకు సిద్ధమైన వరి పైరు వారం రోజులుగా వాతావరణ సూచనల దృష్ట్యా హార్వెస్టింగ్‌లు నిలిపివేశారు. వరి కోత పరువం మించిపోతుందని రైతులు హైరానపడుతున్నారు. పరువం మించటంతో వరి నేలవారడం, కంకి నుంచి రెల్లరాలడం, ధాన్యం నాణ్యత తగ్గటం లాంటి సమస్యలు ఎదురవుతాయని రైతులు తెలుపుతున్నారు. మండలంలో వరి కోతలు ప్రారంభం మొదలు ఏరోజుకారోజు వాతావరణం రైతులను ఇబ్బందులకు గురిచేస్తుంది. ప్రతిరోజు ఆకాశం వైపు చూడడం పత్రికలు, టీవీ ఛానళ్లు, సోషల్ మీడియాలో వచ్చే వాతావరణ హెచ్చరికలు చూసుకుంటూ వరికోతలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి రైతాంగంలో నెలకొంది.

రైతుల ఆందోళనను భగ్నం చేసిన పోలీసులు



రైతులతో మాట్లాడుతున్న డీఎస్పీ నాగేశ్వరరావు, తహసీల్దార్ వేణుగోపాలరావు

నరసరావుపేట రూరల్: బైపాస్ రోడ్డు ఎలైన్‌మెంట్ మార్చాలంటూ రైతులు తలపెట్టిన రాస్తారోకోను పోలీసులు భగ్నం చేశారు. బైపాస్ రోడ్డు ఏర్పాటు వలన విలువైన భూములు కోల్పోతున్నామంటూ పలు గ్రామాల రైతులు జొన్నలగడ్డ సమీపంలోని రింగ్‌రోడ్డు వద్ద మంగళవారం ఆందోళనకు పిలుపునిచ్చారు. రైతుల ఆందోళన కార్యక్రమాలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. డీఎస్పీ కె.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రూరల్ సీఐ పి.రామకృష్ణ, ఎస్ఐ కిశోర్‌ల ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఉదయమే జొన్నలగడ్డ రోడ్డుకు చేరుకున్నారు. జొన్నలగడ్డ, ఇస్సప్పాలెం, కేసానుపల్లి, రావిపాడు గ్రామాలకు చెందిన రైతులు రింగ్‌రోడ్డుకు వద్దకు వచ్చారు. టీడీపీ జెండాలతో పాటు ప్లేకార్డులతో రాస్తారోకోకు సిద్ధమయ్యారు. ఈ సమయంలో పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేయడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. రోడ్డెక్కితే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి రైతులకు నష్టం కలగకుండా చేస్తామని డీఎస్పీ నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. కొంత సేపటికి తహసీల్దార్ వేణుగోపాలరావు అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం పెంచే విధంగా కృషి చేస్తామని తెలిపారు. రైతు ప్రతినిధులను జాయింట్ కలెక్టర్‌తో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. దీంతో రైతులు ఆందోళనను విరమించారు.

క్యారమ్స్ పోటీలలో ఏఎంజీ విద్యార్థుల ప్రతిభ



చిలకలూరిపేట: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ క్యారమ్స్ పోటీలు ప్రకాశం జిల్లాలోని పాకాల జెడ్పీ హైస్కూల్‌లో ఈ నెల 22,23 తేదీలలో నిర్వహించారు. ఈ పోటీలలో ఏఎంజీ హైస్కూల్ విద్యార్థులు అండర్-17 విభాగంలో సీహెచ్ స్టీఫెన్‌పాల్ రజిత పతకం, అండర్ -19 విభాగంలో బందు హేనోస్ కాంస్య పతకం సాధించారు. ఈ విద్యార్థులకు ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి, స్కూల్ హెచ్‌ఎం కె.కృపాదానం, జిల్లా స్కూల్ స్కూల్ గేమ్స్ కార్యదర్శి సురేష్, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, రాజేష్ అభినందనలు తెలిపారు.

ఈకేవైసీ తప్పనిసరి



బొల్లాపల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో పి. సీతారామయ్య సచివాలయ సిబ్బందితో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్, పీఏసీఎస్ ఖాతాదారులు వివరాల నమోదు సంబంధించి సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు సంబంధించి డేటాకు సంబంధించి ఈకేవైసీ చేయాలన్నారు. అలాగే సహకార సంఘంలో ఖాతాదారుల వివరాలు సేకరణ, ఆన్‌లైన్ నమోదు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 కె.పార్వతి, ఏపీవో లక్ష్మణరావు, పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్విమ్మింగ్ పోటీలకు ఎస్ఎస్ అండ్ ఎన్ విద్యార్థి



జగదీష్‌ను అభినందిస్తున్న పాలకవర్గ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థి ఎస్.జగదీష్ జాతీయ స్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల స్విమ్మింగ్ (ఈత) పోటీలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదనరావు మంగళవారం తెలిపారు. ఈనెల 21 నుంచి 23వతేదీ వరకు చెన్నైలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో నిర్వహించిన సౌత్-వెస్ట్ అంతర్ విశ్వవిద్యాలయాల స్విమ్మింగ్ పోటీలో జగదీష్ 800 మీటర్లు ఫ్రీస్టైల్ విభాగంలో 9.56 నిమిషాల సమయం నమోదు చేసి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు వివరించారు. ఈనెల 25 నుంచి 27వతేదీ వరకు ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో జరగనున్న జాతీయస్థాయి పోటీలో జగదీష్ ఏఎన్‌యు జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్త, ప్రిన్సిపల్ డాక్టర్ సుధీర్, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, అధ్యాపకులు అభినందించారు.

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

ప్రభుత్వ చీఫ్‌విప్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



కొండ్రముట్లలో వరి ఓదెలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

ఈపూరు (శావల్యాపురం): అకాల వర్షం వలన పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకుంటుదని ప్రభుత్వ చీఫ్‌విప్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మంగళవారం ఈపూరు మండలం కొండ్రముట్ల గ్రామంలో అకాల వర్షం వలన దెబ్బతిన్న వరి పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆకాల వర్షం వలన దెబ్బతిన్న పంట పొలాలను క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు పరిశీలించి అర్హులైన రైతులకు నష్టం పరిహారం అందేలా నివేదికలు సిద్ధం చేయాలన్నారు. వరి పొలాల్లో తడిచిన ఓదెల్లోని గింజల రంగు మారిన మొలకలు వచ్చిన ధాన్యం సైతం ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టరుతో ఫోన్‌లో మాట్లాడారు. తుఫాన్ ప్రభావం ఉందని రైతులు వరి కోతలు కోయవద్దని వ్యవసాయ అధికారులు సూచనలు రైతులు పాటించాలన్నారు. బొల్లాపల్లి మండలం వెల్లటూరులో 75 కేజీల బస్తా రూ. 1740 లకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతుల బ్యాంకు ఖాతాలో 24 గంటల వ్యవధిలో నగదు జమ అయినట్లు తెలిపారు. దళారులు నియంత్రణ చేయటానికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. అనంతరం రైతులతో మాట్లాడి సాధక బాధలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు, ఏడీఏ బోయపాటి రవిబాబు, ఏవోలు రామినేని రామారావు, అంకారావు, అంజిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వేస్ట్ పికర్స్ తమ పిల్లల అభివృద్ధికి కృషిచేయాలి

బల్లబళ్లు, రిక్షాలు అందజేసిన డీఆర్వో మురళి



బల్లరిక్షాలు అందజేస్తున్న డీఆర్వో మురళి

నరసరావుపేట: వేస్ట్ పికర్స్ తల్లితండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించి వారి అభివృద్ధికి కృషి చేయాలని పల్నాడు జిల్లా రెవెన్యూ అధికారి, అడిషనల్ జిల్లా మెజిస్ట్రేట్ ఏకా మురళి కోరారు. మంగళవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్ఎస్) ఆధ్వర్యంలో సీబీఎస్ కాలనీలో ఏడుగురు వేస్ట్ పికర్స్‌కి ఏర్పాటు చేసిన బల్ల బళ్ళు, రిక్షాలను డీఆర్వో పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం కేజీ నుంచి పీజీ వరకు ఉచితంగా విద్యను అందజేసే ప్రభుత్వ పాఠశాలల్లో మీ పిల్లలను చేర్పిస్తే అభివృద్ధి చెందుతారన్నారు. స్కూల్లోనే మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తుందని, చదువుకోడానికి పుస్తకాలు, డ్రస్సు, ఇంగ్లిష్ మీడియం స్కూల్స్ ఏర్పాటు చేశారని, తద్వారా పిల్లలకు చదువుకొని ప్రయోజకులను చేసేందుకు తల్లిదండ్రులు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. డీబీఆర్ఎస్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, సిటీ కోఆర్డినేటర్ తోకలసాం బయ్య, ఓఎల్ సి సెంటర్ టీచర్ నక్కతామస్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కార్మికురాలి మృతి



నాదెండ్ల: గణపవరంలోని ఓ పొగాకు పరిశ్రమలో పని చేస్తున్న మహిళ రెండు రోజులక్రితం అస్వస్థతకు గురై గుంటూరులో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. అంబేద్కర్ కాలనీలోని సొంగా వెంకటరమణ (56) గడిచిన ముప్పై ఏళ్ళుగా పొగాకు పరిశ్రమలో గ్రేడింగ్ పనులకు వెళ్తుంటుంది. శుక్రవారం గ్రేడింగ్ పనిచేస్తుండగా అస్వస్థతకు గురై పడిపోయింది. ఆమెను వెంటనే చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. ఆమెకు భర్త తిరుపాలు, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆమె మృతి పట్ల మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొండెపాటి నాగయ్య, పార్టీ గ్రామ అధ్యక్షుడు కాట్రు రమేష్, పలువురు నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

గేదెపై వీధికుక్కల దాడి



నాదెండ్ల: గణపవరం గ్రామంలో వీధి కుక్కల బెడద రోజురోజుకు తీవ్రమౌతుండటంతో గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు. ఈ నెల 21న గ్రామంలోని పశువుల ఆసుపత్రి వీధిలో పెడవలి రామారావుకు చెందిన నాలుగు నెలల లేగదూడను వీధికుక్కలు దాడి చేసి పీక్కుతిన్న సంఘటన మరువకముందే అదే పశువుల కొష్టంలో తల్లి గేదెపై సోమవారం అర్ధరాత్రి దాడిచేశాయి. గేదె ముందుభాగంపై దాడి చేయటంతో కొమ్ములతో విసరటంతో వెనుకభాగంపై దాడి చేసి కాళ్ళు, తోకను గాయపరిచాయి. ఉదయాన్నే కొష్టానికి వచ్చిన రామారావు గమనించి గేదెను పశువుల ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించాడు. ఈ ఘటనపై ఆ వీధిలోని పశువుల యజమానులు మంగళవారం పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. వీధికుక్కల దాడులు పెరుగున్నాయని, నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నా పట్టించుకోవటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఏసుక్రీస్తు ఆశీస్సులు అందరిపై ఉంటాయి



సాతులూరు సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఉపాధ్యాయులు, చిన్నారులు

- పార్టీ కార్యాలయంలో సెమీక్రిస్మస్ వేడుకలు
- కేకు కట్‌చేసి పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: ఏసుప్రభు ఆశీస్సుల కోసం క్రిస్టియన్ సోదరులు చేస్తున్న ప్రార్థనలు సఫలీకృతం కావాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం పట్టణ ఎస్సీ సోదరుల ఆధ్వర్యంలో నిర్వహించిన సెమిక్రిస్మస్ వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియచేశారు. గత నెలరోజులుగా భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేస్తూ తమ కుటుంబాలతో సహా మందిరాలకు వెళ్లి ఏసుప్రభు ఆశీస్సుల కోసం చేస్తున్న ప్రార్థనలు సఫలీకృతం అవుతాయన్నారు. మీ కుటుంబాలు సంతోషంగా, ఆరోగ్యంగా, ఆనందకరంగా ఉండాలని ఆ భగవంతుడైన ఏసుక్రీస్తు ప్రభువును ప్రార్థిస్తున్నట్లు వెల్లడించారు. గత 13 ఏళ్లుగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించుకునే వారమని, భవిష్యత్తులో కూడా మళ్లీ తిరిగి మంచి రోజులు వస్తాయని, మనందరం కలిసి క్రిస్మస్ పండుగను నిర్వహించుకోవాలని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మీ అందరి ఆశీస్సులు కావాలని, మీ ప్రార్థనల్లో ఆయన పేరు ఉచ్ఛరించాలని కోరారు. పార్టీ ఎస్సీ నాయకులు జెడ్పీటీసీ సభ్యులు పదముత్తం చిట్టిబాబు, ఎస్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, 12వ వార్డు ఇన్‌చార్జి గంటనపాటి గాబ్రియల్, పంగులూరి విజయకుమార్, మైలేరి మార్కు, ఎడ్వర్డ్ మనోహర్ ,14వ వార్డు నాయకులు పాతర్ల చిన్ని, భూదాల కళ్యాణ్, రుక్మిణి బాబు, తలారి బాలరాజు, ఏ.విజయ్ కుమార్ పాల్గొన్నారు.

గ్రామాల్లో స్టార్స్ ఏర్పాటు

వినుకొండ(నూజెండ్ల): మండల కేంద్రం నూజెండ్లలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని ఫెక్సీలను, స్టార్లను, క్రిస్మస్ చెట్టును ప్రార్థిన మందిరాల వద్ద ఏర్పాటు చేశారు. దూర ప్రాంతాలకు వెళ్ళిన క్రైసవ సోదరులు స్వగ్రామాలకు చేరుకొని ఆనందంగా పండుగ వేడుకలు జరుపుకోవటం అనవాయితీగా వస్తుంది. కుల మతాలకు అతీతంగా గ్రామస్తులు ప్రజాప్రతినిధుల క్రైస్తవ సోదరులకు సంఘీభావం తెలియజేస్తున్నారు. క్రిస్మస్ పండుగ నాడు తమ బంధుమిత్రలతో వీరంతా ఆనందంగా సంతోషంగా గడుపుతారు. పండుగ సందర్భంగా దైవసేవకులు ప్రత్యేకంగా ప్రార్థనలు జరుపుతున్నారు.



నూజెండ్ల ప్రధాన కూడలి మార్గంలో ఏర్పాటు చేసిన స్టార్

బాలభారతిలో సెమీక్రిస్మస్

నాదెండ్ల: సాతులూరులోని బాలభారతి ఉన్నత పాఠశాలలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ జంపని లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీస్తు బోధనలు ఆచరిస్తే సమాజం శాంతి సామరస్యాలతో వర్ధిల్లుతుందన్నారు. క్రీస్తు చూపిన ప్రేమ, దయ కరుణ చూపినపుడే జీవితాలు సుసంపన్న అవుతాయన్నారు. అనంతరం వివిధ వేషధారణల్లో చిన్నారులు ఆకట్టుకున్నారు.

గీతమ్స్‌లో

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని గీతమ్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాంసస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి మాట్లాడుతూ యేసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని క్రిస్మస్ పండుగ వేడుకలను నిర్వహిస్తారన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో క్రిస్మస్ పండుగను బుధవారం నిర్వహించుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో క్రిస్టమస్ స్టార్‌లు, క్రిస్టమస్ చెట్లను ఏర్పాటు చేసుకొని విద్యుత్ దీపాలతో అలంకరించారు. చర్చీలను కూడా రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. ఇప్పటి వరకు గ్రామాల్లో, గృహాల్లో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించిన క్రైస్తవ సోదరులు ఈ నెల 25వ తేదీన చర్చీల్లో పెద్ద ఎత్తున ప్రార్థనలు, క్రీస్తు బోధనలు జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా క్రీస్తు పుట్టుకను, మహిమలను తెలియ జేసుందుకు గేయ రూపకాలు ప్రదర్శనలను కూడా చర్చిల్లో నిర్వహించేందుకు సమాయత్తం అవుతున్నారు.

శావల్యాపురంలో..

శావల్యాపురం: క్రిస్మస్ పండుగ సందర్భంగా విమోచన ప్రార్థన మందిరం వారి ఆధ్వర్యంలో మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో కొవ్వొత్తుల ర్యాలీతో పాటు సెమిక్రిస్మస్ వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా మత బోధకులు సీహెచ్.యేజేస్కేలు పాల్గొని మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రభువు లోకరక్షకుడు అన్నారు. శాంతి కరుణా ప్రేమ దయ ఆయన చూపిన మార్గంలో అందరు నడవాలన్నారు ఏసుక్రీస్తు జన్మించిన రోజున క్రిస్మస్ పండుగ రోజుగా జరుపుకుంటామన్నారు. అనంతరం పురవీధుల్లో క్రిస్మస్ గీతాలతో అలరింపచేశారు.ఈకార్యక్రమంలో ఫాస్టర్ సీహెచ్.కస్తూరి, ప్రశాంత్ నిశాంత్, చర్చి సభ్యులు పాల్గొన్నారు.



నరసరావుపేటలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



వేడుకల్లో గీతమ్స్ చిన్నారులు



బొందిలిపాలెంలో వేడుకల్లో పాల్గొన్న మత బోధకులు



విద్యుత్ కాంతులతో ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చి

విద్యుత్ కాంతులతో చర్చిలు

వినుకొండ(నూజెండ్ల): క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని పలు చర్చిలు విద్యుత్ కాంతులతో సిద్ధమయ్యాయి. నరసరావుపేట రోడ్డులోని ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చి విద్యుత్ కాంతులతో ఏర్పాటు చేసిన అలంకరణ ఆకర్షిస్తోంది.

విద్యుదాఘాతానికి గురై మహిళ మృతి

బొల్లాపల్లి : విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని బండ్లమోటు ఎస్ఐ ఎ. బాలకృష్ణ తెలిపారు. ఎస్ఐ వెల్లడించిన వివరాల ప్రకారం వెల్లటూరు గ్రామానికి చెందిన అర్ధలపూడి విజయలక్ష్మి (47) విద్యుత్ షాక్ తలగడంతో ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. ఇంటి ముందు డ్రెయినేజీ పూడిపోవడంతో పూడిక తీయడానికి డాబాపై ఉన్న ఇనుప రాడ్డు తీసుకొని వస్తుండగా డాబాపై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలు ఇనుప రాడ్డుకు తగలడంతో ఇది గమనించని విజయలక్ష్మి షాక్‌కు గురైంది. ఈ ప్రమాదంలో అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయింది. మృతురాలికి భర్త, ఇద్దరు సంతానం. కుమారుడు ఎ.అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

సంస్కృతి కోసం కృషి చేస్తున్న బాలోత్సవం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట: విద్యార్థులలో సామాజిక స్పృహ, దేశభక్తి, అభ్యుదయ భావాలు పెంపొందించడంతో పాటు అంతరించిపోతున్న దేశ సంస్కతి, సంప్రదాయాలను కాపాడేందుకు పల్నాడు బాలోత్సవం చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. ఈ నెల 28, 29 తేదీలలో నిర్వహించనున్న పల్నాడు బాలోత్సవం పిల్లల పండుగ-2 పురస్కరించుకొని మంగళవారం టీడీపీ పార్టీ కార్యాలయంలో కమిటీ సభ్యులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. విద్యార్థులలో సృజనాత్మకతకు అద్దంపట్టేలా వినూత్న అంశాలలో పోటీలు నిర్వహిస్తున్న బాలోత్సవం కమిటీని ఎమ్మెల్యే అభినందించారు. బాలోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు మాట్లాడుతూ 2023 బాలోత్సవం అట్టహాసంగా చేశామని, 10 వేల మందికి పైగా విద్యార్థులు తమకు ఇష్టమైన ఆట, పాటలు, వివిధ కళలు, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి తమ ప్రతిభ చాటారన్నారు. అదే స్ఫూర్తితో రానున్న శని, ఆదివారం రెండురోజుల పల్నాడు రోడ్డులోని పాలడుగు నాగయ్య చౌదరి - కొత్త రఘురామయ్య కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేస్తామన్నారు.